క్లుప్తంగా

పూజలు.. అన్నదానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ శ్రీనగర్ మధురానగర్ కాలనీలో గల శ్రీశ్రీశ్రీ సద్గురు సాయినాథ్ మందిరంలో మొదటి గురువారం సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన వందలాది మంది భక్తులు పూజల్లో పాల్గొనగా.. అన్న ప్రసాద వితరణ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెంకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఎంఎల్‌సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫార్సు ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం సీపీఎం మండల నాయకులు వి.సుదర్శన్‌రెడ్డి అందించారు. బాధితులైన పీకల ఉమారాణికి రూ. 85వేలు, జి.పాపమ్మకు రూ.18 వేలు, జి.వీరప్రసాద్‌కు రూ.13,500లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరారవు, వెంకటేశ్వర్లు, చామకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

51వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 51వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం ఆధ్వర్యాన గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 15 మంది కార్మికులు, జేసీబీతో డివిజన్‌లో ఖాళీ స్థలాలు, డ్రెయినేజీలను శుభ్రం చేయించినట్లు కార్పొరేటర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శీలంశెట్టి వీరభద్రం, చెన్నారావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ



వాటర్ కూలర్, పోడియం అందిస్తున్న దృశ్యం

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ ఉన్నత పాఠశాల విద్యార్థుల తాగునీటి కోసం ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు కనుకుల భిక్షపతి రూ.25 వేల వాటర్ కూలర్, రూ.10 వేల పోడియం, రూ.10 వేలు విలువ చేసే జామెట్రీ బాక్స్‌లను గురువారం బహూకరించారు. ఈమేరకు దాతను పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.రాధాకృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వి.తిరుపమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: పూలే, అంబేడ్కర్ అధ్యాయన వేదిక కార్యాలయంలో ఈ నెల 18న నిర్వహించే సర్వాయి పాపన్న జయంతిని జయప్రదం చేయాలని గురువారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మందా రామారావు, అల్లిక వెంకటేశ్వరావు, బానోత్ భద్రూనాయక్, శ్రీనివాస్‌గౌడ్, రాంబాబు, విజయ్‌కుమార్, సోమరాజు, లింగబోయిన లక్ష్మణ్, మట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతుల ఆరా

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రాధాకృష్ణనగర్‌లోని టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ కర్షకసేవా సంఘానికి రైతులు క్యూ కడుతున్నారు. సంఘంలో 4,224 మంది రైతులు రుణం తీసుకోగా రూ.30.63కోట్ల రుణమాఫీ కావాల్సి ఉంది. అయితే, రెండు విడతల్లో 1,240మంది రైతులకు రూ7.46కోట్ల మేర మాఫీ కావడంతో మిగతా వారు వివరాలు తెలుసుకునేందుకు కార్యాలయానికి వస్తున్నారు. జాబితాల్లో పేర్లు లేకపోవడంపై ఆరా తీస్తూ సరిచేయాలని కోరుతున్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 3వ తేదీన బీవీకే-సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, బీవీకే ట్రస్ట్ చైర్మన్ వై.శ్రీనివాసరావులు తెలిపారు. ఈమేరకు గురువారం నర్రా రమేష్ అధ్యక్షతన వైద్య శిబిరం నిర్వాహకులు సమావేశమయ్యారు. గుండె పరీక్షలతో పాటు న్యూరో, యూరాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్ పరీక్షలు ఉచితంగా చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో పార్టీ టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు వాసిరెడ్డి వీరభద్రం, అఫ్జల్, కృష్ణారావు, పి.ఝాన్సీ, పి.వాసు, భద్రం, గుమ్మడి భిక్షం, జె.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

నేలకొండపల్లి: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ ఏసీడీపీఓ కనకదుర్గ అన్నారు. మండలంలోని చెరువుమాధారం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ పార్వతి, టీచర్లు కోటేశ్వరీ, జానకి, ఉమ, శారద, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే గువ్వలగూడెం కేంద్రంలో సూపర్‌వైజర్ పి.నాగమణి ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించి తల్లిపాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, ఏఎస్‌ఎం సరస్వతి, అంగన్‌వాడీ టీచర్స్ పుష్పలత, రమాదేవి, ఆశా కార్యకర్త శైలజ తదితరులు పాల్గొన్నారు.

‘గుట్ట’కు మహర్దశ..!



రోడ్డు నిర్మాణం కోసం గుట్టను చదును చేస్తున్న జేసీబీ

రమణగుట్టపై అభివృద్ధి పనులు షురూ..

- ఎస్టీ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు చర్యలు
- రాళ్లు, కంప చెట్ల తొలగింపు
- నెరవేరనున్న ఏళ్లనాటి కల
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని నూతన బస్టాండ్ సమీపంలో ఉన్న రమణగుట్టపై నివసిస్తున్న ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుట్టపై ఉన్న ఎస్టీ కాలనీ వాసులకు 2009లో ఇళ్ల పట్టాలు వచ్చినా.. నాటి నుంచి రోడ్లు, డ్రెయినేజీలు, కనీస సౌకర్యాలు కల్పించలేదు. తాజాగా ఎస్టీ కాలనీ వాసుల సమస్యలకు చెక్ పెట్టేలా, వారి ఇబ్బందులను తొలగించేలా మంత్రులు, ఎంపీల సహకారంతో స్థానిక కార్పొరేటర్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. దశాబ్ద కాలం తర్వాత 400 కుటుంబాలకు సౌకర్యవంతంగా రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు స్థానిక కార్పొరేటర్ పేర్కొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు చర్యలు..

57వ డివిజన్‌లో కొత్తబస్టాండ్‌కు సమీపంలో ఉన్న ఈ గుట్ట పైభాగాన ఎస్టీ కాలనీ ఉండడంతో అక్కడకు వెళ్లేందుకు సరైన దారి కూడా లేదు. దీంతో గతంలో పైకి వెళ్లేలా మెట్లు నిర్మించారు. తాజాగా కాలనీలో 400 కుటుంబాలకు పైగా ఉపయోగించుకునేలా 400 మీటర్లకు పైగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ ఎండీ రఫీదా బేగం, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ ముస్తఫా చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం కోసం అడవిలా పెరిగిన కంప, పిచ్చి మొక్కలు, చెట్లు, పెద్దపెద్ద బండరాళ్లను తొలగించారు. ఇళ్ల ముందుకు రోడ్లతో పాటు డ్రెయినేజీలను నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నారు.

బడి, గుడి నిర్మించేలా..

స్థానికుల సమస్యల పరిష్కారం కోసం గుట్టపైన రోడ్ల నిర్మాణం కోసం పిచ్చి మొక్కలు, రాళ్లను తొలగిస్తున్నారు. దీంతో కొంత మేర ఖాళీ స్థలం లభ్యమవుతుండడంతో స్థానికులకు ఉపయోగపడేలా పాఠశాల, గుడిని నిర్మించాలని తలచినట్లు కార్పొరేటర్, స్థానిక నాయకులు పేర్కొంటున్నారు. స్థానికంగా నివాసం ఉండే వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం కలెక్టర్, రెవెన్యూ, కేఎంసీ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు స్థానిక నేతలు వెల్లడించారు.



స్థానికులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు ఎండీ ముస్తఫా

డివిజన్ అభివృద్ధికి కృషి..



కనీస సౌకర్యాల లేమితో ఉన్న రమణగుట్ట అభివృద్ధికి గతంలో కనీస నిధులను కేటాయించలేదు. దీంతో మంత్రి, ఎంపీలు ఈ ప్రాంత అభివృద్ధికి నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే మున్సిపల్ నిధులకు సంబంధించి రూ.70 లక్షలు ఈ డివిజన్‌కు కేటాయించారు. త్వరలోనే రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం పూర్తి చేస్తాం.

– ఎండీ రఫీదా బేగం, 57వ డివిజన్ కార్పొరేటర్

ఎన్నో ఇబ్బందులు పడ్డాం..



రమణగుట్టపై నివాసముంటున్న మాకు 2009లో ఇంటి పట్టా వచ్చింది. ఈ ప్రాంతంలో నడిచేందుకు రోడ్డు మార్గం లేక.. గుట్ట పైకి ఎక్కేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డాం. నీళ్లు, కరెంట్ సౌకర్యం లేదు. ప్రస్తుత కార్పొరేటర్ సహకారంతో ఇప్పుడు ఆ సమస్య తీరింది. మా బాధలను తొలగిస్తున్నారన్న ఆనందం మాలో ఉంది.

– రాచకొండ లక్ష్మి, ఎస్టీ కాలనీ వాసి

రోడ్డు కోసం స్థలాన్ని ఇచ్చా..



ఎస్టీ కాలనీ వాసుల సౌకర్యం కోసం రోడ్లు వేస్తుండడం సంతోషంగా ఉంది. రోడ్డు కోసం నా ఇంటి స్థలం అడ్డుగా ఉండడంతో వేరే చోట స్థలం ఇస్తామని నేతలు చెప్పారు. గుట్టపై నాకు అధికారికంగా ఎక్కడ స్థలం ఇచ్చినా తీసుకుని, నా స్థలాన్ని రోడ్డు కోసం ఇస్తాను. ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజలు రోడ్డు కోసం ఎదురు చూస్తున్నారు.

– బట్ల లలిత, స్థానికురాలు

రుణమాఫీపై ఆంక్షలు సరికాదు



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఆంక్షలు విధించి రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతులు క్షమించరని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రఘునాథపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ కాని 60శాతం మంది రైతులకు అండగా నిలబడి బీజేపీ పోరాటాలు చేస్తుందని, ఇందుకు బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రారంభించారన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రభుత్వం చేతిలో మోసపోయిన రైతుల వివరాలను సేకరించి రాష్ట్రవ్యాప్తంగా రైతు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, పాలేరు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, నల్లగట్టు శ్రీను, యువ మోర్చా మండల అధ్యక్షుడు గంట్ల లక్ష్మారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఇందురి మహేష్, బూత్ అధ్యక్షులు భిక్షం గోవర్ధన్, వినోద్, సోమన్న, పాపాలాల్, మధు, మాల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల నిరసన



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: అసెంబ్లీ సాక్షిగా బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఆ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆధ్వర్యాన గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. సీఎం వెంటనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ.. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు దాదె అమృతమ్మ, పల్లా రోస్‌లీనా, బుర్రి వెంకట్, కూరాకుల వలరాజు, పసుమర్తి రామ్మోహన్, దండా జ్యోతిరెడ్డి, తోట వీరభద్రం, కన్నం ప్రసన్నకృష్ణ, మక్కల రాజేష్, రవి, డోకుపర్తి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పొలంబాట

కామేపల్లి: మండలంలో వానకాలం పంట సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్న తరుణంలో.. వ్యవసాయాధికారులు సైతం రైతులు, కూలీలతో పొలంబాట పట్టారు. మండలంలోని కామేపల్లి, జాస్తిపల్లి గ్రామాల్లో వరినాట్లు జరుగుతుండగా.. ఖమ్మం డివిజన్ ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ తారాదేవిలు అక్కడకు చేరుకొని పలువురు రైతులు, కూలీలతో కలిసి నాట్లు వేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీచౌక్ అడ్డా పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని గురువారం స్థానిక కాల్వొడ్డు యూనియన్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎస్‌కె.సలీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం నూతన అధ్యక్షుడిగా పావురాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా చప్పు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా జంగం నరేష్, సహాయ కార్యదర్శిగా పాశం కృష్ణారెడ్డి, కోశాధికారిగా కాకులారం కిట్టు, సలహాదారుడిగా బండి శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దండి శ్రీను, నెల్లూరి సుధాకర్, సూర్యాపేట రాములు, ఫరీద్, నహీమ్, యాకూబ్, ఉషాబాబు, ఏసు, ఉపేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



నేలకొండపల్లిలో ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్/రఘునాథపాలెం/నేలకొండపల్లి/ఖమ్మంమయూరిసెంటర్/తిరుమలాయపాలెం: ఎన్నికల సమయాన కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నాయకులు ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఈమేరకు ఆయా మండలాల్లో ర్యాలీలు నిర్వహించి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్లకు అందించారు. అనంతరం ఖమ్మంరూరల్ మండలంలో పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య, రఘునాథపాలెంలో రాష్ట్ర నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, నేలకొండపల్లిలో పార్టీ పాలేరు డివిజన్ నాయకుడు పగిడికత్తుల రామదాసు, ఖమ్మంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్, పార్టీ జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు మాట్లాడారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇల్లు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలు పరిష్కారం కోసం పేద ప్రజలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 8న కలెక్టరేట్ల ఎదుట ధర్నా, 21న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు మలీదు నాగేశ్వరరావు, ఎం.మల్లయ్య, ఎడ్లపల్లి ఉపేందర్, కేలోతు లక్ష్మణ్, ఆవుల మంగతాయి, మేక రామనాథం, జరపల దేవల, ధరావత లక్ష్మణ్, పి.నాగేశ్వరరావు, పెద్దపాక వెంకన్న, దాసరి వంశీ, ఝాన్సీ, శిరోమణి, శోభ, సురేష్, జాస్మిన్, తిమ్మిడి హనుమంతరావు, ఎడ్లపల్లి నవీన్,.వెంకటస్వామి, ఆరెంపుల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంట్ కోత

ఖమ్మంవ్యవసాయం/ ఖమ్మంరూరల్/రఘునాథపాలెం: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈలు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈక్రమంలో ఖమ్మం నగరంలోని 33/11 కేవీ ప్రకాశ్‌నగర్ సబ్ స్టేషన్ 11 కేవీ గాంధీచౌక్ ఫీడర్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రకాశ్‌నగర్, ఎఫ్‌సీఐ గోడౌన్స్ లైన్, పోలీస్ కమిషనరేట్ ఎదురు ప్రాంతం, సుందరయ్యనగర్, బోస్ బొమ్మసెంటర్, జమలాపురం కేశవరావు పార్క్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–1 ఏఈ ఎం మౌలిక తెలిపారు. అలాగే నగరంలోని 33/11 కేవీ ఇల్లెందు క్రాస్‌రోడ్ సబ్ స్టేషన్ 11 కేవీ వీడీఓస్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బ్యాంక్ కాలనీ, వీడీఓస్ కాలనీ, గట్టయ్య సెంటర్లలో విద్యుత్ సరఫరాకు అతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ బి.తావుర్యా తెలిపారు. అదేవిధంగా ఖమ్మంరూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్, గుర్రాలపాడు ఎస్‌ఎస్‌లోని 11కేవీ ఫీడర్, వెంకటగిరి, వెంకటగిరి ఇండస్ట్రియల్ ఫీడర్లలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఏదులాపురం, గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ క్రాంతిసింహ తెలిపారు. అంతేకాక రఘునాథపాలెం మండలంలోని కోటపాడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాపటపల్లి, చిమ్మపుడి, వీఆర్‌బంజర, కోటపాడు తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని మంచుకొండ ఏఈ పి.సతీష్ తెలిపారు.

గ్రానైట్ రాళ్లను తొలగించి.. శుభ్రం చేసి..



గ్రానైట్ రాళ్లు, ఇసుక తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: కొత్త బస్టాండ్‌లో ఏటీఎంల పక్కన క్యాంటీన్ నిర్వాహకులు పడేసిన గ్రానైట్ రాళ్లు, ఇసుకను ఆర్టీసీ అధికారులు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. గురువారం సాక్షి దినపత్రికలో ‘కొత్త బస్టాండ్‌లో అపరిశుభ్రత’.. శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. బస్టాండ్ లోపల ప్రయాణికులు నడిచే మార్గంలో ఉంచిన వీటిని తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

మార్కెట్ కార్యదర్శి బదిలీ

నేలకొండపల్లి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్.సంతోష్‌కుమార్ సూర్యాపేట మార్కెట్‌కు గురువారం బదిలీ అయ్యారు. ప్రస్తుతం మహబూబాబాద్ డీఎంఓగా, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పని చేశారు.

వినతుల వెల్లువ...

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కామేపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ప్రజలు రోగాలబారిన పడకుండా కాపాడాలని బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఎంపీడీఓ రవీందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పల్లెలు అధ్వానంగా ఉన్నాయని, పారిశుధ్యం లోపించి ప్రజలు అనారోగ్యాల పాలువుతున్నారని ఎంపీడీఓకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆంతోటి అచ్చయ్య, వడియాల కృష్ణారెడ్డి, యలమద్ది అప్పారావు, మల్లెంపాటి శ్రీనివాసరావు, మూడ్ కృష్ణప్రసాద్, సామా మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యాన తహసీల్దార్ సుధాకర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామేపల్లి, కారేపల్లి సంయుక్త మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తే సహించేది లేదని, హామీలు అమలయ్యేలా ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రన్న, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పింఛన్ ఇవ్వాలి

రఘునాథపాలెం: భవన నిర్మాణ కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యాన గురువారం తహసీల్దార్.........కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు పేరాబోయిన వెంకన్న, మండల నాయకులు పసుపులేటి నరసింహారావు మాట్లాడుతూ.. 50 ఏళ్లు దాటిన కార్మికులకు షరతులు లేకుండా రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, లేబర్ కార్డు ఉన్నవారికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, ఈఎస్‌ఐ ఆస్పత్రి సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచుకొండ ఉపేందర్, ఎం.రమేష్, వెంకట్, చింతగుర్తి వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గిరిజనులకు మత్స్యశాఖ సభ్యత్వాలు

కామేపల్లి: ఏజెన్సీలో గత 50 ఏళ్లుగా చెరువుల్లో చేపలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులను ప్రభుత్వం గుర్తించి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ద్వారా సభ్యత్వాలు ఇచ్చి, వారికి గుర్తింపు కార్డులు అందజేయడం హర్షనీయమని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ అన్నారు. గురువారం కొమ్మినేపల్లి, పండితాపురం గ్రామాల్లో 106 మంది గిరిజనులకు నూతన మత్స్యశాఖ సభ్యత్వాలు అందజేసినసందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు భూక్యా నాగేంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేకల మల్లికార్జునరావు, బండి నాగేశ్వరరావు, బానోత్ నరసింహా, మామిళ్ల చిన్ననర్సయ్య, అయితనబోయిన వీరభద్రం, రాయల నాగశంకర్, తురక భిక్షం, బత్తుల ఉపేందర్, చల్ల మల్లయ్య, డేరంగుల తిరపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి

తిరుమలాయపాలెం: తపాలా శాఖలో అమలు చేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సబ్ డివిజన్ పర్యవేక్షణ అధికారి కాళిమహేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని పిండిప్రోలులో తపాలా శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తపాలా శాఖ గ్రామ ప్రజల కోసం చిన్నమొత్తాల పొదుపు పథకాలు, ఎస్‌బీ, ఆర్‌డీ, పీపీఎఫ్, జీవిత బీమా పాలసీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తక్కువ ప్రీమియంతో బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎం శంకర్, ఎంటీఎస్ లక్ష్మయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన సవరణ ప్రక్రియ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించిన సవరణ ప్రక్రియ మూడు రోజులుగా నిలిచిపోయాయి. కేఎంసీ కార్యాలయంలో మూడు ప్రత్యేక కౌంటర్ల ద్వారా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకొని జీరో బిల్లు, గ్యాస్ కనెక్షన్లకు సంబంధించిన సవరణలు చేస్తున్నారు. మూడు రోజులుగా ఆన్‌లైన్ సర్వీసు నిలిచిపోవడంతో రోజూ కార్యాలయానికి వచ్చి వెనుదిరుగుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రభుత్వాల విధానాలతో ప్రజలకు నష్టం

ఖమ్మంఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలు ప్రజలకు నష్టం కలిగిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎర్ర శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం పార్టీ ఖానాపురం హవేలి కమిటీ సమావేశం ఇందిరానగర్‌లోని సత్తెనపల్లి రామకృష్ణ భవనంలో తోట నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్పొరేట్ శక్తులు కొమ్ముకాసేలా మోదీ విధానాలు ఉన్నాయని, స్థానిక సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠపరచాలని, 14 రకాల సరుకులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఎం పార్టీ హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు,పి రమ్య, ఎస్.వెంకన్న, టి.నరసింహ, పి.వెంకటి, పి.నాగమణి, వి.రమాదేవి, కె.అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని చెప్పి ఇప్పుడు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు తెలిపారు. గురువారం వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే కార్మికులకు సంబంధించిన వెల్ఫేర్ బోర్డులో చాలా పెండింగ్ క్లెయిమ్‌లున్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎం.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, ఉపేందర్, జి.బ్రహ్మం, కె.రాంబాబు, రాజయ్య, సుధాకర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

5న కేఎంసీ కౌన్సిల్ సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 5న నిర్వహించేందుకు మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యలు నిర్ణయించినట్లు తెలిసింది. దీనిలో భాగంగా కౌన్సిల్‌లో ప్రవేశపెట్టబోయే అంశాలకు సంబంధించిన అజెండా కాపీలను సిద్ధం చేసిన అధికారులు వాటిని కార్పొరేటర్లకు అందించి, సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ సమావేశంలో కార్యాలయ పరిపాలన, గత పనులకు సంబంధించిన బిల్లులు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. గత నెల చివరి వారంలోజరగాల్సిన సమావేశం అసెంబ్లీ సమావేశాలు, ఇతర కారణాలతో వాయిదా వేశారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబరాలు

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్, మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యాన గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచి బాణాసంచా కాల్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అమరులను స్మరించుకుని అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. – సాక్షినెట్‌వర్క్



తిరుమలాయపాలెంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సంబరాలు



ఖమ్మంరూరల్: మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఖమ్మంసహకారనగర్: మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో..

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా



ధర్నా చేస్తున్న మాలమహానాడు నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జిల్లా మాల మహానాడు ఆధ్వర్యాన గురువారం జెడ్పీసెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గుంతేటి వీరభద్రం, ముదుసు జాకబ్‌ప్రతాప్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అన్ని కులాలను సమదృష్టితో చూడాలని, ఒక కులానికి మద్దతు పలకడం సరైంది కాదన్నారు. తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకరాజు, నాగేశ్వరరావు, లక్ష్మీనరసింహారావు, శ్రీనివాస్, దయానంద్, వేణు, రాములు, మల్లయ్య, రాధాకృష్ణ, జ్యోతి, ఏలీయా, పార్వతమ్మ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.